

# ANAKAPALLI DISTRICT POLICE

# NEWSPAPER CLIPPINGS DT.05.04.2023

ABN ఆంధ్రజ్యోతి

## పోలమాంబకు ఎస్పీ గౌతమీశాలి పూజలు



బోనంతో వెళ్తున్న ఎస్పీ గౌతమీశాలి

**విశాఖపట్నం, ఏప్రిల్ 4:** విశాఖ నగరంలోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో గల పోలమాంబ అమ్మవారికి మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎంఎస్ గౌతమీశాలి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాజరాజేశ్వరిదేవిని దర్శించుకున్నారు. డీఎస్పీ పి.నాగేశ్వర రావు, ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో రిజర్వు సీఐలు రామకృష్ణారావు, సతీష్, ఎంటీవోలు ఆదినారాయణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అమ్మవారికి బోనం సమర్పించారు.

Date: 05/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 8

Source : https://epaper.andhrajyothy.com

సాక్షి

# సందడిగా అమ్మవారి జాతర



సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం పోలమాంబ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఈ ప్రాంతంలో ఆరు చోట్ల పోలమాంబ ఆలయాలు ఉన్నాయి. ఆయా చోట్ల పండగ వాతావరణం నెలకొంది. ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఆపరేషన్ కాలనీ, దీనదయాళ్‌పురం, బీసీగదిలి, సూర్యతేజానగర్, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీల్లో కొలువుదీరిన పోలమాంబకు వారం రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన పండగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, కానుకలు చెల్లించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాల వద్ద నిర్వాహకులు క్యూలు ఏర్పాటు చేశారు. మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. పెదగదిలిలో పోలమాంబ అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, సభ్యులు దర్శించుకున్నారు. సంజయ్‌గాంధీ కాలనీలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, 11వ వార్డు కార్పొరేటర్ స్వాతి, ఆలయ అధ్యక్షురాలు కంటుమర్తి నాగరాణి, సభ్యులు దర్శించుకున్నారు. సూర్యతేజానగర్‌లో 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఆలయ కమిటీ సభ్యులు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయా ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, పలు నిర్వహించారు. ఆరిలోవ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పెదగదిలిలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి దంపతులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో పోలమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలిని హాజరయ్యారు. పూర్ణ కుంభం తలపై మోసుకుంటూ పోలమాంబను దర్శించుకున్నారు. ఈ పూజల్లో ఆర్‌ఐలు రామకృష్ణారావు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



విశాలాక్షినగర్‌లో పోలమాంబ పూజకు పూర్ణకుంభంతో వెళ్తున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలిని

Date: 05/04/2023, Edition: Visakhapatnam(Visakhapatnam East), Page: 9
Source : https://epaper.sakshi.com/

ఈనాడు
epaper.eenadu.net

# పోలమాంబ ఆలయంలో ఎస్పీ పూజలు



అమ్మవారికి మొక్కు చెల్లిస్తున్న ఎస్పీ గౌతమి

అనకాపల్లి పట్టణం: విశాఖపట్నం కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలోని పోలమాంబ అమ్మవారు, రాజరాజేశ్వరిదేవిని ఎస్పీ గౌతమి మంగళవారం దర్శించుకున్నారు. ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐలు రామకృష్ణారావు, సతీష్ వెంట ఉన్నారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

వార్త

# శ్రీపోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ గౌతమిశాలి



అనకాపల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమిశాలి విశాఖపట్నం, కైలాసగిరి ఆర్మ్డ్ రిజర్వ్ మైదానంలో ఉన్న పోలమాంబ అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిని దర్శించుకున్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దేవాలయం వార్షిక పండుగకు ఆహ్వానం మేరకు పూర్ణకుంభంతో జిల్లా ఎస్పీని ఆహ్వానం పలికిన ఆర్మ్డ్ రిజర్వ్‌డిఎస్పీ పి.నాగేశ ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం పోలమాంబ అమ్మవారి తీర్థప్రసాదాలను జిల్లా ఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణారావు, సతీష్, ఎంటిజలు నాయుడు, ఆదినారాయణ తదితరఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Date: 05/04/2023, Edition: Vishakapatnam(Vishakapatnam main), Page: 11
Source : https://epaper.vaartha.com/

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ సీజ్

**కశింకోట, ఏప్రిల్ 4:** మండలంలోని కొత్తపల్లి బుచ్చెయ్యపేట గ్రామం మీదుగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టే ఎస్ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుకను తీసుకువెళుతున్న ట్రాక్టర్ పట్టుబడిందన్నారు. ఒక యూనిట్ ఇసుక, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ట్రాక్టర్ డ్రైవర్ కోట్ని రాజాబాబుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

Date: 05/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 8
Source : https://epaper.andhrajyothy.com

## ఇరువర్గాల భూవివాదంతో గవరవరంలో పోలీసుల గ్రామసభ

**చోడవరం, ఏప్రిల్ 4 :** గవరవరంలో ఇరువర్గాల మధ్య భూ వివాదం తలెత్తిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పోలీసులు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని, భూ తగాదాలు, చెడు వ్యసనాలకు అంతా దూరంగా ఉండాలని ఎస్ఐ అప్పలనాయుడు సూచించారు. గ్రామంలో అనుమానితులు ఎవరైనా సంచరిస్తే తమకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### భూ వివాదంలో న్యాయం చేయాలని వినతి

గవరవరంలో తలెత్తిన భూవివాదంలో గ్రామానికి చెందిన ఉప్పల అప్పారావు కుటుంబానికి న్యాయం చేయాలని యాదవ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ తిరుమలబాబుకు విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు మొల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరణికాన బాబూరావు, సెబ్బి శ్రీనివాసరావు, కరక సోమునాయుడు, పల్లా నరసింగరావు, మొల్లి ప్రసాద్, గోకివాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిని అందిస్తున్న సంఘం నాయకులు

Date: 05/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 9
Source : https://epaper.andhrajyothy.com

వార్త

# పింఛను డబ్బులు చోరీకి సంబందించి క్రైమ్ పోలీసులు విచారణ

మాకవరపాలెం ఏప్రిల్ 4 ప్రభాతవార్త



సోమవారం ఫింఛను సొమ్ము చోరీ సంబందించి పోలీసులు విచారణ ముమ్మరం చేసారు. ఈమేరకు మంగళవారం అనకాపల్లి క్రైమ్‌బ్రాంచ్ ఎస్సై రమేష్ అధ్వర ంలో విచారణ చేపట్టారు. సోమవారం సాయంత్రం శెట్టిపాలెం సచివాలయ పరిధిలోని గ్రామాలకు సంబందించి ఫింఛను డబ్బులు రూ,16,15,750 ఇన్‌చార్చి కార్యధర్శి నుంచి ఇద్దరు అగంతకులు బలవంతగా చోరీచేసిన విషయం తెలిసిందే. దీంతో అనకాపల్లి జిల్లా ఎస్.పి ఆదేశాలు మేరకు అగంతకులు అచూకి కోసం క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రంగంలో దిగారు. ఈ సందర్భంగా క్రైమ్ ఎస్సై రమేష్ అధ్వర్యంలో చోరికి గురైన ప్రదేశం దుంగలవానిపాలెం జెంక్షన్‌లోను ఇండియన్ ఓవర్సీయస్ బ్యాంక్ వద్ద ఉన్న సి,సి పుటేజీలను పరిశీలించారు. దీనిలో భాగంగా ప్రధాన రహదారి తామరం పరిదిలో ఉన్న బజాజ్, హీరోహోండా కార్యాలయం పరిదిలోని సి,సి,పుటేజీలు పరిశీలించారు. పోలీసుల పరిశీలనలో కొంతమేరకు పురోగతి ఉన్నట్లు సమాచారం. కార్యక్రమంలో స్ధానిక ఎస్సై పి.రామకృష్ణారావు తదితరులు పాల్గోన్నారు.

వార్త

# యువత చెడు మార్గాలు పట్టవద్దు



చోడవరం, ఏప్రిల్4 ప్రభాతవార్త

యువత చెడు మార్గంలో తిరిగి వ్యసనాలకు అలవాటయితే వారి జీవితాలు నాశనం అవుతాయని, చదువు అలవాట్లకు దూరంగా ఉంటే వారి భవిష్యత్తు బంగారులా ఉంటుందని చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని గవరవరం గ్రామంలో ఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అప్పలనాయుడు మాట్లాడుతూ యువత జాగ్రత్తగా లేకపోతే చెడు త్వరగా ఆకర్షిస్తుందని దానివలన విలువైన జీవితాలు, భవిష్యత్తు నాశనం అవుతుందని పేర్కొన్నారు. భూమి తగదాలకు దూరంగా ఉండాలని ఎంత సహనంగా ఉంటామో అంత భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పతివాడ అప్పారావు, గుమ్మాల ముత్యాల నాయుడు పలువులు యువకులు పాల్గొన్నారు.

epaper.eenadu.net

# మద్య నిషేధంపై మాట తప్పిన జగన్

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: గత ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం అమలు చేస్తామని జగన్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై రాష్ట్రం ఆధారపడే స్థాయికి తెచ్చారని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం విశాఖలోని తెదేపా కార్యాలయంలో ఆమె మాట్లాడారు. "మద్యం వ్యాపారం జగన్, ఆయన బృందానికి కలిసివస్తోంది. రూ.వేల కోట్లు తాడేపల్లి నివాసానికి అడ్డదారిలో వెళ్తున్నాయి. మద్య నిషేధం అమలు చేయకుండా ఎన్నికలకు వెళితే జగన్‌పై మహిళలు తిరగబడే పరిస్థితి ఉంది. గత నాలుగేళ్లలో రూ.96 వేల కోట్ల విలువైన మద్యం అమ్మకాలు సాగాయి. రాష్ట్ర



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఇతర నాయకులు

ప్రభుత్వ మొత్తం ఆదాయంలో నాలుగో వంతు దీని ద్వారానే వస్తోంది. జగన్, బుగ్గన, రోహిత్‌రెడ్డిలు కలిసి ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ధరలు నిర్ణయిస్తున్నారు. మద్యం తయారు చేసే డిస్టిలరీలన్నీ జగన్ బినామీల పేర్లపై నడుస్తున్నాయి" అని ఆరోపించారు. సమావేశంలో తెలుగు మహిళలు అనంతలక్ష్మి, కేదారి లక్ష్మి, సత్య, తోట రత్నం, సుజాత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH ( VISAKHAPATNAM ) PageNo :

ABN ఆంధ్రజ్యోతి

# వైసీపీ పాలనలో జిల్లా సర్వనాశనం

- అప్పుల కోసం రూ.వందల కోట్ల ఆస్తులు తాకట్టు
- మూడు షుగర్ ఫ్యాక్టరీలను మూసేశారు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు ధ్వజం

అనకాపల్లి అర్బన్, ఏప్రిల్ 4: నాలుగేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాను సర్వనాశనం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. మంగళవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ, బాబు జగ్జీవన్ రామ్ సుజల స్రవంతి ప్రాజెక్టు పనులకు బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించారని, ఈ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసే ఉద్దేశం వైసీపీ ప్రభుత్వానికి లేదని ఆయన ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు పంచడానికి బ్యాంకుల నుంచి అప్పుల కోసం విశాఖలో వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టడం శోచనీయమని అన్నారు. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న వాటాను కారు చౌకగా అదానీ కంపెనీకి కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. జిల్లాలోని సహకార చక్కెర కర్మాగారాలను ఆధునీకరిస్తామని గత ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత జగన్ హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత మూడు ఫ్యాక్టరీలను మూసివేశారని అన్నారు. ప్రభుత్వ తీరుతో చెరకు రైతులు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను అమ్మకానికి



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

పెట్టారని, దీనిపై సహకార రైతులు, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేయడంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెడతామంటూ కొత్త రాగం వినిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నాయకులు కశింకోట మండలంలో విసన్నపేట గ్రామానికి ఆనుకుని 600 ఎకరాల్లో వేసిన అక్రమ లేఅవుట్‌కు రహదారి కోసం దళితుల భూములు, ప్రభుత్వానికి చెందిన కొండలు, వాగులు, వంకలను ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లాస్థాయి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విలేఖరుల సమావేశంలో టీడీపీ పట్టణప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి సూరే సతీశ్ పాల్గొన్నారు.

Date: 05/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 7
Source : https://epaper.andhrajyothy.com

ఈనాడు
epaper.eenadu.net

## జగన్‌కు ముందస్తు ఎన్నికలకెళ్లే ధైర్యం లేదు: బుద్ధా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వైకాపా టైటానిక్ నౌక లాంటిందని, 2024 ఎన్నికల్లో కచ్చితంగా మునిగిపోతుందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'మండలి ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులు ఓడిపోవడంతో ఆ పార్టీలో తిరుగుబాటు మొదలైంది. అనేక మంది వైకాపా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు తెదేపాలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో జగన్‌కు చంద్రబాబు అంటే భయం పట్టుకుంది. అందుకే సోమవారం జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో గతంలో చూపిన గాంభీర్యం ప్రదర్శించలేకపోయారు. మూడు రోజుల క్రితం మంత్రి సీదిరి అప్పలరాజుకు సీఎంఓ నుంచి పిలుపు రాగా, అక్కడ ఆయన ఎదురు తిరిగే పరిస్థితి నెలకొనడంతో సీఎం వెనక్కి తగ్గారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి జైలుకు వెళితే మొదట బయటకు వచ్చే పేరు జగన్‌మోహన్‌రెడ్డిదే. వచ్చే ఎన్నికల్లో వైకాపా కూలిపోతుంది. జగన్‌కు ముందస్తు ఎన్నికలకు వెళ్లే ధైర్యం లేద'ని పేర్కొన్నారు.

## 'విశాఖను దోచుకుంటున్న వైకాపా నేతలు'

**అనకాపల్లి:** వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు విశాఖను దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. అనకాపల్లిలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'విశాఖలోని ప్రభుత్వ ఆస్తులన్నింటినీ తాకట్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం తెచ్చే గంగవరం పోర్టును అదానీ గ్రూపునకు తక్కువ ధరకే అమ్మేశారు. తుమ్మపాల కర్మాగారాన్ని అమ్మకానికి పెట్టిన మంత్రి అమర్‌నాథ్ ఇప్పుడు అక్కడ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ పెడతామంటున్నారు. ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అనకాపల్లి పరిశోధన కేంద్రం ఆవరణలో పెట్టాలన్న ప్రతిపాదనలు ఉన్నాయ'ని చెప్పారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# కార్మికుడి కుటుంబానికి రూ.30 లక్షల పరిహారం



రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు

**అచ్యుతాపురం, న్యూస్‌టుడే:** అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థికమండలిలో రెయిన్ సీ కార్బన్ లిమిటెడ్ (ఆర్‌సీఎల్) కంపెనీలో పనిచేస్తూ మృతిచెందిన పూడిమడకకు చెందిన మత్స్యకార కార్మికుడు కొవిరి వెంటయ్య(45) కుటుంబానికి రూ.30 లక్షల పరిహారం అందివ్వడానికి గుత్తేదారు అంగీకరించారు. రూ.కోటి పరిహారం అందివ్వాలని గ్రామానికి చెందిన మత్స్యకారులు కంపెనీ ఆవరణలో మంగళవారం తెల్లవారుజాము వరకు బైఠాయించారు. కంపెనీ ప్రతినిధులు పరిహారం తేల్చకపోవడంతో ఒకదశలో కంపెనీలోకి దూసుకెళ్లారు. మత్స్యకారులు అధిక సంఖ్యలో రావడంతో ఉద్రిక్తత నెలకొంది. పలు దఫాలుగా జరిపిన చర్చల్లో రూ.30లక్షల పరిహారం ఇవ్వడానికి గుత్తేదారు అంగీకరించారు. సీఐ మురళీరావు, ఎస్సై సన్యాసినాయుడు, ఏఎస్సై రాజాన అప్పారావు సిబ్బందితో రాత్రంతా కంపెనీ వద్ద బందోబస్తు విధులు నిర్వహించారు. మత్స్యకార నాయకులు ఉమ్మిడి అప్పారావు, ఉమ్మిడి జగన్, వాసుపల్లి శ్రీను, సూరాడ ధనరాజ్, మేరుగు మహేష్, పొన్నమళ్ల కొండబాబు పాల్గొన్నారు.

## కార్మికుల ప్రాణాలకు వెలకడుతున్నారు

అమాయకులైన కార్మికుల ప్రాణాలను డబ్బులతో కంపెనీల యాజమాన్యాలు, గుత్తేదారులు వెలకడుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము మండిపడ్డారు. కంపెనీల్లో పేద కార్మికులు ప్రాణాలు భద్రతా లోపంతో గాల్లో కలిసిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని లక్షలు చెల్లిస్తే ఆ కుటుంబాలకు క్షోభ నుంచి తప్పిస్తాయని ప్రశ్నించారు. అచ్యుతాపురం సెజ్‌లో కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, వైకాపా ప్రభుత్వం కార్మికుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఇప్పటికైన జిల్లా యంత్రాంగం స్పందించి కంపెనీల్లో భద్రతా ఆడిట్ చేపట్టాలని రాము డిమాండ్ చేశారు.

ఈనాడు
epaper.eenadu.net

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి: పీలా



మాట్లాడుతున్న పీలా

**అనకాపల్లి, న్యూస్‌టుడే:** సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ సూచించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం అనకాపల్లి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. వైకాపా నాయకుల అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. విశాఖలో బుధవారం జరగనున్న సదస్సుకు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు హాజరుకావాలన్నారు. నాయకులు కోట్ని రామకృష్ణ, మాదంశెట్టి నీలిబాబు, ధనాల విష్ణుచౌదరి పాల్గొన్నారు.

## అక్రమంగా కేసులు పెడితే ఉపేక్షించం

**అనకాపల్లి గ్రామీణం:** తెదేపా నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడితే ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. అక్కిరెడ్డిపాలెంలో మంగళవారం కాపీవిత్ క్యాడర్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తూ తప్పుడు కేసులు పెడితే ఉద్యమిస్తామన్నారు. అనంతరం వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

సాక్షి

# అయ్యన్న అలక!

**మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడు అలకబూనారు. పార్టీని అంటి పెట్టుకున్న తమని కాదని.. ఇన్ని రోజులూ పార్టీకి దూరంగా ఉన్న గంటా శ్రీనివాసరావుకు ప్రాధాన్యమివ్వడంపై రగిలిపోతున్నారు. పార్టీలో తన పాత్రపై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన విశాఖలోని వి–కన్వెన్షన్‌లో నిర్వహించే పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి రానని తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో అయ్యన్నను ఆ పార్టీ సీనియర్ నేతలు కొందరు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు భోగట్టా. పార్టీలో తనకు ప్రాధాన్యతతోపాటు ఎమ్మెల్యే టికెట్, తన కొడుకుకు ఎంపీ సీటు ఇస్తామన్న స్పష్టమైన హామీ కోసం అయ్యన్న పట్టుబడుతున్నట్లు సమాచారం. మరో వైపు పాయకరావుపేట నియోజకవర్గంలోనూ గంటా జోక్యం చేసుకుంటూ తనకు టికెట్ రాకుండా చేస్తున్నారంటూ అనిత కూడా మండిపడుతున్నారు. బుధవారం సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, ఎమ్మెల్యే వెలగపూడి హాజరుకావడంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.**

–సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

- **గంటాకు ప్రాధాన్యమివ్వడంపై కినుక**
- **చంద్రబాబు సమావేశానికి వచ్చేది లేదని స్పష్టీకరణ**
- **అయ్యన్నను బుజ్జగిస్తున్న టీడీపీ సీనియర్లు**
- **తన నియోజకవర్గంలో గంటా జోక్యంపై అనిత మండిపాటు**



ఇన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉండి.. ఇప్పుడు ఎన్నికలకు ముందు హడావుడి చేస్తున్న నేతలతో జాగ్రత్తగా ఉండాలంటూ గతంలో విశాఖలో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలోనే అయ్యన్నపాత్రుడు కుండబద్దలు కొట్టారు. ఎవరండీ గంటా.? లక్షల్లో ఒకరు.. ఆయన ఏమైనా పెద్ద నాయకుడా.? అని ప్రశ్నించారు. ఇన్ని రోజులుగా ఇంట్లో నక్కుకుని.. ఇప్పుడు బయటకు వస్తున్నారని.. వారితో జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ అధిష్టానం గంటాకే తాజాగా మద్దతు తెలపడం అయ్యన్నకు రుచించడం లేదు. తాజాగా జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అంతా తానే నడిపించినట్టుగా గంటా వ్యవహరించడంతో పాటు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి కూడా హాజరయ్యారు. ఈ వ్యవహారాలకు అయ్యన్న దూరంగా ఉన్నారు. తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ అడుగుతుంటే... వేరే వ్యక్తిని గంటా ప్రతిపాదిస్తున్నారని అయ్యన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడోపేడో తేల్చుకునేందుకు అయ్యన్న సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

### గంటా జోక్యంపై ఆగ్రహం

నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో ఇటీవల జరిగిన స్థానిక పండగకు గంటాను రుత్తల యర్రాపాత్రుడు ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణను పిలిచారు. అయితే ఈ సమావేశానికి అయ్యన్న వ్యతిరేకులైన ముత్యాలపాప, బండారు హాజరయ్యారు. ఈ వ్యవహారం వెనుక కూడా గంటానే ఉన్నారనే అనుమానాలను అయ్యన్న వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా గంటా జోక్యం చేసుకుంటున్నారంటూ అనిత ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో తనకు వ్యతిరేకంగా సమావేశమైన నేతలను పార్టీ నుంచి అనిత సస్పెండ్ చేయించారు. ఈ వ్యవహారంపై బహిష్కరణకు గురైన నేతలు అనిత తీరుపై మండిపడుతున్నారు. కాపు నేతలను అనిత సహించడం లేదని, గతంలో కాపు నేతలపై చెప్పుతో దాడి చేయించారని విమర్శిస్తున్నారు. దీనిపై టీడీపీ సమాధానం చెప్పకపోతే ఆ పార్టీ తీరును ఎండగడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. విశాఖలో జరిగే సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి కూడా దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. వెలగపూడి మాత్రం తన తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విజయవాడలో ఉన్నాననే సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. విశాఖలో బుధవారం జరిగే చంద్రబాబు సమావేశానికి ముందే పార్టీలో అంతర్గత కలహాలు రచ్చకెక్కడం చర్చకు దారి తీసింది.

### కాపులపై అనిత కక్షసాధింపు

- గంటాను కలవడం వల్లే మాపై సస్పెన్షన్ వేటు
- పాయకరావుపేటలో బహిష్కృతులైన టీడీపీ నేతల ఆగ్రహం

-8లో

Date: 05/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 7
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# కాపులపై అనిత కక్ష సాధింపు

- గతంలో కార్యకర్తపై చెప్పుతో దాడి
- గంటాను కలవడం వల్లే మాపై సస్పెన్షన్ వేటు
- పాయకరావుపేటలో బహిష్కృతులైన టీడీపీ నేతల ఆగ్రహం
- పార్టీకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరిక



మాట్లాడుతున్న టీడీపీ బహిష్కృత నాయకులు రాజబాబు, నారాయణరావు

నక్కపల్లి/పాయకరావుపేట: నియోజకవర్గంలో కాపులపై మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొర్లె రాజబాబు, పాయకరావుపేట పట్టణశాఖ మాజీ అధ్యక్షుడు తుని, పాయకరావుపేట పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈ ఇద్దరు నాయకులను సస్పెండ్ చేస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు పాయకరావుపేటలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం వారిని అనిత చులకనగా చూస్తోందన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నడిరోడ్డుపై చెప్పుతో కొట్టిందన్నారు. టీడీపీలో కాపు నాయకుడిగా ఉన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవల నక్కపల్లి మండలం వేంపాడుకు చెందిన టీడీపీ నాయకుడు కల్లేపల్లి బాబ్జిరాజు ఇంటికి వస్తే తాము వెళ్లి గంటాను కలిశామన్నారు. దీనిపై కక్ష కట్టిన అనిత తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయించిందన్నారు. అనిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆమె చేస్తున్న అవినీతి అక్రమాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో ఆమెకు పాయకరావుపేట టికెట్ ఇవ్వలేదన్నారు. అప్పటినుంచి అనిత తమపై కక్ష కట్టిందన్నారు. అనిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తమను కలుపుకొనిపోవడం లేదని, పార్టీ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదన్నారు. అయినా పాయకరావుపేటలో ప్రతి పార్టీ కార్యక్రమం తాము నిర్వహిస్తున్నామన్నారు. తాము ఎటువంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదన్నారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర నాయకత్వం తమను సస్పెండ్ చేయడానికి గల కారణాలను తెలియజేయాలని తమపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి పార్టీలో కాపులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. పార్టీ నిర్ణయం మార్చుకోకపోతే రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరికీ భయపడే ప్రసక్తి లేదన్నారు. అధిష్టానం తమకు న్యాయం చేయకపోతే తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

Date: 05/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 8
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆదిలక్ష్మి రాజీనామా

నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ కనకారావును కలిసి రాజీనామా లేఖ అందజేశారు. కుటుంబ బాధ్యతల దృష్ట్యా చైర్‌పర్సన్‌గా వ్యవహరించడం కష్టమని భావించి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మెజారిటీ సాధించి అధికార పీఠం దక్కించుకుంది. 2020 మార్చి 18న చైర్‌పర్సన్‌గా ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా గొలుసు నర్సింహమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ.. రెండేళ్ల పాటు ఆదిలక్ష్మి చైర్‌పర్సన్‌గా, నర్సింహమూర్తి వైస్ చైర్మన్‌గా ఉంటారని, రెండేళ్ల తర్వాత బోడపాటి సుబ్బలక్ష్మి చైర్‌పర్సన్‌గా, కోనేటి రామకృష్ణ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని ప్రకటించారు. సోమవారం వైస్ చైర్మన్‌గా గొలుసు నర్సింహమూర్తి రాజీనామా చేయగా, మంగళవారం ఆదిలక్ష్మి రాజీనామా పత్రం అందజేశారు. రాజీనామా చేయడానికి ముందు చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, సోదరుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడబండి నాగేశ్వరరావు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. రాజీనామా చేసేందుకు వచ్చిన చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొలుసు నర్సింహమూర్తి, వీరమాచినేని జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు ఉన్నారు.



రాజీనామా లేఖను కమిషనర్‌కు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

Date: 05/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 7

ఈనాడు
epaper.eenadu.net

## భూకబ్జా ఆరోపణలపై అధికారుల ఆరా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం మండలం పోడపల్లిలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి 15 ఎకరాల అటవీ భూమిని కబ్జా చేశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై వీఎంఆర్‌డీఏ అధికారులు ఆరా తీశారు. జనసేన కార్పొరేటర్ ఇచ్చిన భూకబ్జా ఫిర్యాదుపై ప్రాథమిక సమాచారం తెలుసుకోవడానికి మంగళవారం వీఎంఆర్‌డీఏ టౌన్ ప్లానింగ్ అధికారులు స్థానిక వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిను వెంటబెట్టుకొని పోడపల్లిలో లే అవుట్‌ను పరిశీలించారు. అటవీభూములు, చెరువు భూములు ఉన్నాయా?, రక్షణగోడ నిర్మాణం ఎంత వరకు జరిగిందనే విషయాలను ప్రాథమికంగా నిర్ధారించుకోవడానికి ఆధునిక సాంకేతికత ఉపయోగించి తెలుసుకునే ప్రయత్నం చేశారు. లేఅవుటులో వేసిన రోడ్లు, రక్షణ గోడ, నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులు కబ్జా ఫిర్యాదుపై వివరాలు అడిగితే వివరించడానికి అవగాహన కోసం మాత్రమే వచ్చామని అధికారులు వెల్లడించారు. అడవి జంతువుల నుంచి లేఅవుట్‌లో ఉండే ప్రజలకు ప్రమాదం జరగకుండా ఉండాలనే లక్ష్యంతో గోడ నిర్మించామని, లే అవుట్‌ను విస్తరించడానికి భూములు కొనుగోలుచేసి అనుమతులకు దరఖాస్తులు పెట్టడం వల్లే 125 ఎకరాలకు రక్షణగోడ నిర్మించామని లేఅవుటు ప్రతినిధులు అధికారులకు వివరించారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

సాక్షి

# మళ్లీ మనదే గెలుపు

- జగన్ తిరిగి సీఎం అవడం ఖాయం
- జిల్లాలో మొదట గెలిచే సీటు యలమంచిలి
- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- యలమంచిలిలో కార్యకర్తల విస్తృత సమావేశం




యలమంచిలిలో వైయస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

**యలమంచిలి :** అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. మంగళవారం యలమంచిలి గుర్రప్ప కల్యాణ మండపంలో 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి కార్యక ర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, సచి వాలయ కన్వీనర్లు, గృహసారథులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు.

ఈనెల 7వ తేదీ నుంచి 20 వరకు జరిగే ' జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమంలో ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ ఘనతలను వివరిం చాలని ఆయన పేర్కొన్నారు. గత చంద్రబాబునా యుడు ప్రభుత్వం అవినీతితో పరిపాలన సాగిస్తే, నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథ కాలు అవినీతికి తావులేకుండా ప్రజలకు అందిస్తు న్నామని అన్నారు. ఇటీవల కొన్ని పచ్చ పత్రికలు పనికట్టుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయ ని, ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమని అన్నారు. జిల్లాలో మొట్టమొదటిగా గెలిచే సీటు యల మంచిలి సీటు అని ఘంటాపథంగా చెబుతున్నాను అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టా త్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాలో నెంబర్ 1 స్థానంలో యల మంచిలి నియోజకవర్గం ఉందన్నారు.రానున్న ఎన్ని కల తరువాత తెలుగుదేశం పార్టీ శాశ్వతంగా మూత పడనుందని, చంద్రబాబు, పప్పు లోకేష్‌కు ఇవే ఆఖరి ఎన్నికలని అభివర్ణించారు. 7వ తేదీ నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పారదర్శకంగా ఇంటింటికి వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకా లను గూర్చి లబ్ధిదారులకు వివరించాలన్నారు. అలాగే వారి ఇంటికి ముఖ్యమంత్రి జగన్ బొమ్మ ఉన్న స్టిక్కరును అతికించి ఇంటి యజమాని సెల్‌కు ఒక స్టిక్కర్ అతికించి 8296082960 నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే వారి సెల్ నెంబర్‌కు వచ్చే ముఖ్యమంత్రి సందేశం వినిపించాలన్నారు. కార్యకర్తలే పార్టీ విజయానికి పునాది అని, రానున్న ఎన్నికల్లో వైఎస్సా ర్‌సీపీ 175 సీట్లు కైవసం చేసుకోనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియో జకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, నాలుగు మండలాల ఎంపీపీలు బోదెపు గోవింద్, మళ్ల జయలక్ష్మి, గొట్టిముక్కల శ్రీనుబాబు, కోన లచ్చన్నాయుడు, నాలుగు మం డలాల జెడ్పీటీసీలు దూళి నాగరాజు, పెంటకోట స్వామి సత్యనారాయణ, సేనాపతి సంధ్యారాణి, లాలం రాంబాబు, నర్మాల కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపుగుప్తా, నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొద్దపు యర్రయ్యదొర, పిన్న మరాజు కిశోర్‌రాజు, దేశంశెట్టి శంకరరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, కొల్లి త్రినాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు, దూది నర్సిం హమూర్తి, డాక్టర్ త్రినాథ్, గొర్లె వెంకట్, నాలుగు మండలాల సచివాలయ కన్వీనర్లు కర్రి శివ, వీసం వాసు, రాజాన విజయ్, కొవిరి రామ కృష్ణ, పొల మేర శెట్టి గణేష్, నాలుగు మండలాల గృహసార థులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Date: 05/04/2023, Edition: Anakapalle(Payakaraopeta), Page: 9
Source : https://epaper.sakshi.com/

ఈనాడు
epaper.eenadu.net

# 3500 మందితో ఉత్తరాంధ్ర తెదేపా సదస్సు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** తెలుగుదేశం పార్టీ (జోన్1) ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు బుధవారం పీఎంపాలెం విశాఖ కన్వెన్షన్ కేంద్రంలో జరగనున్నది. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడంతో భాగంగా తెదేపా జోన్ల వారీ ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. గత నెలలో ఈ సదస్సు జరగాల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాల వల్ల రెండుసార్లు వాయిదా పడింది. ప్రస్తుతం సదస్సు నిర్వహణకు పార్టీ యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేసింది. అధినేత చంద్రబాబునాయుడు పాల్గొని పార్టీ నేతలు, శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి యూనిట్ బాధ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కలిపి 2500 మంది వరకు హాజరుకానున్నారు. వీరితో పాటు ఆరు జిల్లాల పరిధిలోని నియోజకవర్గ బాధ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, పార్టీ నేతలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొననున్నారు. అంతా కలిపి 3500 మంది వరకు సదస్సులో పాల్గొనే అవకాశం ఉందని పార్టీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

★ తెదేపా అధినేత చంద్రబాబునాయుడు బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకుంటారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత ఉత్తరాంధ్ర ముఖ ద్వారమైన విశాఖకు తొలిసారిగా అధినేత వస్తున్నందున ఘనంగా స్వాగతం పలకాలని పార్టీ నేతలు నిర్ణయించారు. అనంతరం విమానాశ్రయం నుంచి నేరుగా సదస్సు జరిగే ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 6గంటల వరకు పార్టీ నేతలు, శ్రేణులనుద్దేశించి మాట్లాడనున్నారు. సదస్సుకు వచ్చే నేతలు, కార్యకర్తలకు ఆహారం, వసతి కల్పించడానికి అయిదు కమిటీలను నియమించారు. మంగళవారం పార్టీ పరిశీలకులు చినరాజప్ప, బుద్దా వెంకన్న, నేతలు పల్లా, బండారు, గంటా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, పల్లా శ్రీనివాసరావు తదితరులు వేదికను పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. 70 మంది నేతలు కూర్చొనేలా వేదికను సిద్ధం చేశారు.



వేదిక ఏర్పాట్లు పరిశీలిస్తున్న నేతలు పల్లా, బండారు

### ఏఏ కార్యక్రమాలు ఉంటాయంటే..

★ ఉదయం 10 గంటలకు రాష్ట్ర అధ్యక్షులు, జోనల్ అధ్యక్షుల ప్రసంగాలతో సదస్సు ప్రారంభమవుతుంది. టెలిగ్రామ్ బాట్ ద్వారా సభ్యత్వ నమోదుపై శిక్షణ ఇస్తారు. ఆర్టీఎస్, ఓట్ల పరిశీలన, కుటుంబ సాధికార, సారథి నియామక ప్రక్రియపై అవగాహన, న్యూ ట్రిపుల్ యాప్, సామాజిక మాధ్యమాలు, వాట్సప్ గ్రూపులు, అక్రమ అరెస్టులు, కేసులు ఎదుర్కోవడంపై న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అధినేత చంద్రబాబునాయుడు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2.40 గంటల నుంచి జోనల్, పార్లమెంటు వారీ సమీక్షలు, చివరిలో అధినేత ముగింపు ఉపన్యాసం ఉంటుందని పల్లా శ్రీనివాసరావు వివరించారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

సాక్షి

# కొమళ్లపూడిలో పట్టపగలే దొంగతనం

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టిన దుండగులు
- బంగారం, వెండి నగలు, నగదు చోరీ
- క్లూస్ టీంతో విచారణ చేస్తున్న పోలీసులు



**బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు**



**దొంగతనం జరిగిన ఇంట్లో విచారణ చేస్తున్న క్లూస్ టీం,ఎస్ఐ కుమారస్వామి**

**బుచ్చెయ్యపేట:** పట్టపగలే ఇంటి తాళాలు పగలు గొట్టి బీరువాలో దాచిన బంగారు, వెండి నగలుతో పాటు నగదు పట్టుకు పోయిన సంఘటన బుచ్చెయ్యపేట మండలం కొమళ్లపూడిలో జరిగింది. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి కథనం మేరకు గ్రామానికి చెందిన పాము రాము మంగళవారం ఉదయం మాడుగుల మండలం గాదిరాయిలో ఉంటున్న తన అత్తవారింటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూడగా ఇంటి తాళాలు తీసి ఉండడం, లోపల బీరువాలు తెరిచి బట్టలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఇంట్లో దాచిన 8 తులాలు బంగారం, 10 తులాలు వెండి వస్తువులు, రూ. 5 వేలు వరకు నగదు దొంగతనం జరిగినట్టు బాధితుడు తెలిపాడన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీంను రప్పించి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోలీసులకు తెలిపిన వస్తువులతో పాటు ఇంకా ఎక్కువ మొత్తంలో వస్తువులు పోయినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. బాధితుడు స్కూల్ కమిటీ చైర్మన్‌గా, ఆటో డ్రైవర్‌గా పనిచేయడంతో పలువురు నాయకులు బాధితుడిని పరామర్శిస్తున్నారు.

Date: 05/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 8
Source : https://epaper.sakshi.com/

ఈనాడు
epaper.eenadu.net

## 'పింఛన్ల సొమ్ము వాలంటీరు స్వాహా'

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదతీనార్ల పంచాయతీ పరిధిలోని ఓ వాలంటీరు పింఛన్ల సొమ్ము స్వాహా చేశారని ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు ఆరోపించారు. నక్కపల్లిలో మంగళవారం మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కువ మంది మత్స్యకారులున్నారన్నారు. వారిలో కొందరు వలస వెళ్లగా.. 16 నంబరు క్లస్టర్‌లో పనిచేస్తున్న వాలంటీరు సుమారు పది మందికి చెందిన పింఛను సొమ్మును కాజేశారని, దీనిపై విచారణకు డిమాండు చేశారు.

Date : 05/04/2023
EditionName :
ANDHRA PRADESH
( ANAKAPALLI ) Pag

ఈనాడు
epaper.eenadu.net

## కోమళ్లపూడిలో ఆభరణాల చోరీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడిలో మంగళవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. బంగారం, వెండి ఆభరణాలను దొంగలించారు. ఈ గ్రామానికి చెందిన పాము రాము ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో కలిసి గాదిరాయిలో మినప చేను తీయడానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. కంగారు పడి బీరువా తెరిచి చూడగా.. సుమారు 13 తులాలు బంగారం, 34 తులాల వెండి వస్తువులు దొంగలు పట్టుకుపోయినట్లు గుర్తించారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కుమారస్వామి తన సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. బాధితుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. చోరీ జరిగిన ఇంటి పరిసరాల్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు.



చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

సాక్షి

## పోక్సో కేసులో యువకుడి అరెస్టు

**మునగపాక:** రాజుపేటకు చెందిన యువకునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. మండలానికి చెందిన మైనర్ బాలిక గత నెల 8వ తేదీన కళాశాలకు వెళతానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇదే మండలానికి చెందిన యువకుడు సదరు బాలికతో కలిసి హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి, అక్కడ నుంచి బాలికను తీసుకువచ్చారు. అయితే యువకుడి ఆచూకీ లేకపోవడంతో గాలింపు చేపట్టారు. మంగళవారం రాజుపేట సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ యువకుడు కనిపించడంతో అతనిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

Date: 05/04/2023, Edition: Anakapalle
(Anakapalle District), Page: 8
Source : https://epaper.sakshi.com/

సాక్షి

## నగదు చోరీపై ముమ్మర విచారణ

**మాకవరపాలెం:** పించన్ల నగదు చోరీపై క్రైం బ్రాంచి పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మండలంలోని దుంగలవానిపాలెం వద్ద సోమవారం రూ.16.15 లక్షల నగదు చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన క్రైం బ్రాంచి ఎస్ఐ రమేష్ మంగళవారం కూడా నగదు డ్రా చేసిన బ్యాంకులోని సీసీ ఫుటేజీలతోపాటు రోడ్డుకు ఇరువైపులా వివిధ షాపులు, షోరూం వద్ద ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు ఉన్నారు.

సాక్షి

## ఇసుక అక్రమ తరలింపుపై కేసు

**కశింకోట :** మండలంలోని బుచ్చియ్యపేట శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ కోట్ని రాజాబాబును అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

Date: 05/04/2023, Edition: Anakapalle
(Anakapalle District), Page: 9
Source : https://epaper.sakshi.com/

సాక్షి

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైల్వే ట్రాక్ వద్ద ఉన్న గుర్తు తెలియని మృతదేహం

**అరకులోయ రూరల్:** మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని అరకు లోయ రైల్వే ఆర్పీఎఫ్ ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఉంటుందన్నారు. స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న ఆయన విజయనగరం రైల్వే జీఆర్పీ పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం సంఘటన స్థలం చేరుకుని పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగి ఉండవచ్చన్నారు. మృతదేహం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బంధువులు ఎవరైనా ఉంటే ఏరియా ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

Date: 05/04/2023, Edition: Anakapalle (Anakapalle District), Page: 8
Source : https://epaper.sakshi.com/

సాక్షి

## యూకలిప్టస్ చెట్లను నరికిన వ్యక్తిపై కేసు

**అనకాపల్లి టౌన్ :** మండలంలోని గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట సర్వే నెం.107 ప్రభుత్వ భూమి లో యూకలిప్టస్ చెట్లను నరికిన వ్యక్తిపై రూరల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ గంగాధరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెం.107 ఆనుకుని రహదారి ప్రక్కన గ్రామీణ విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ లైన్లు వేస్తున్న సమయంలో గోపాలపురం గ్రామానికి చెందిన వ్యక్తి ఈ నెల 3న దాదాపు పావు ఎకరంలోని చెట్లను నరికి వేసినట్లు గుర్తించామన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ స్థలంలో చెట్లు/మొక్కలను నరికినప్పుడు సంబంధిత శాఖాధికారులకు సమాచారం అందించాలి. ఎలాంటి ముందస్తు అనుమతులేకుండా చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.



యూకలిప్టస్ చెట్లను కొట్టేసిన ప్రదేశం

ge: 9

ఈనాడు
epaper.eenadu.net

## దారిదోపిడీపై దర్యాప్తు ముమ్మరం

**మాకవరపాలెం, న్యూస్‌టుడే:** దుంగలవానిపాలెం సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు యువకులు సోమవారం సాయంత్రం జిడ్.గంగవరం సచివాలయ కార్యదర్శి సవ్యశ్రీని అడ్డగించి రూ.16.15 లక్షల నగదు బ్యాగుతో ఉడాయించిన ఘటనపై నేరవిభాగం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మార్గంలో పెట్రోల్ బంకులు, వాహన షోరూముల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీను క్రైం బ్రాంచ్ ఎస్సై రమేష్, మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు మంగళవారం పరిశీలించారు. ఇప్పటివరకు కొన్ని ఆధారాలను సేకరించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చెప్పారు. భీమబోయినపాలెం, శెట్టిపాలెం, జిడ్.గంగవరం గ్రామాలకు చెందిన పింఛనుదారులకు రెండు రోజుల్లో సొమ్ము చెల్లిస్తామని ఎంపీడీఓ అరుణశ్రీ చెప్పారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

సాక్షి

# 'చలో ఢిల్లీ'కి తరలిన సీఐటీయూ నాయకులు



చలో ఢిల్లీ కార్యక్రమానికి బయల్దేరుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఢిల్లీలో ఈ నెల 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పరవాడ మండలం నుంచి సీఐటీయూ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్క్‌ర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర మల్లేశ్వరరావు, యూనియన్ ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణ్ తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

Date: 05/04/2023, Edition: Anakapalle (Anakapalle District), Page: 9
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# వివాదంలో ఉన్న భూముల్లో పనుల అడ్డగింత



**వివాదంలో ఉన్న భూముల్లో పనులను అడ్డుకుంటున్న ఫిర్యాదుదారులు**

**గొలుగొండ:** నర్సీపట్నం ఆర్డీవో కోర్టులో వివాదంలో ఉన్న భూములను గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేపట్టి ఈ భూముల్లో లే అవుట్లు వేసేందుకు పనులు చేపడుతున్నారని ఫిర్యాదు అందడంతో మంగళవారం ఆ పనులను నిలుపుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గొలుగొండ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 490లో 3.67 ఎకరాలు భూమి ఉంది. జోగుంపేటకు చెందిన చేపల వెంకయ్యమ్మ పేరున ఈ భూమి 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసుకున్నారు. వెంకయ్యమ్మకు కుమారుడు గంగలు, కుమార్తె దొంగతల్లి(చిట్టమ్మ) ఉన్నారు. ఈ నేపథ్యంలో గంగలు వారసులకు ఈ భూమి అన్యాయంగా దఖలు పడిందని ఆరోపిస్తూ వెంకయ్యమ్మ కుమార్తె దొంగతల్లి(చిట్టమ్మ) ఆర్డీవో కోర్టులో రెండేళ్ల క్రితం కేసు వేశారు. తన తల్లి వెంకయ్యమ్మ పేరున ఉన్న భూమిలో తనకు కూడా వాటా వస్తుందని కేసు వేశారు. ఈ కేసు నడుస్తున్న సమయంలోనే గంగలు వారసులు ఈ భూమిని అమ్మకోవడం జరిగిందని, ఆ భూమిలో లేఅవుట్ పనులు చేపడుతున్నారని చిట్టిమ్మ వారసులు అధికారులను ఆశ్రయించడంతో పాటు మంగళవారం ఆ భూమిలో చదును పనులను అడ్డుకున్నారు. గంగలు వారసులు ఆ భూమిని నర్సీపట్నంకు చెందిన వ్యక్తులకు అమ్మకాలు జరిపారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇక్కడ ఎటువంటి పనులు చేయరాదని అక్కడి వారిని హెచ్చరించి పనులు నిలుపుదల చేశారు. వివాదం ఆర్డీవో కోర్టులో ఉన్నందున భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరపరాదని స్పష్టం చేశారు. ఆర్ఐ నర్సింగరావు, వీఆర్వో రాజుబాబు, ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

సాక్షి

# ఉర్లోవ కొండపై మైనింగ్ లీజులు రద్దు చేయాలి

- ప్రజాభిప్రాయ సేకరణ ఎదుట ప్రజల ఆందోళన

**మాడుగుల రూరల్:** ఉర్లోవ కొండపై మైనింగ్ లీజులు రద్దు చేసి, పట్టాదారుల భూములన్నీ అడంగల్‌లో నమోదు చేయాలని కోరుతూ మంగళవారం వి.జె.పురంలో ప్రజాభిప్రాయ సేకరణ ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వి.జె.పురంలో మైఖేల్ అంటోనీకి కలర్ గ్రానైట్ క్వారీ సర్వే నెంబరు 1-13, 1-14, 1-23లో 116 ఎకరాలకు పర్యావరణ అనుమతులు నిమిత్తం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. డీఆర్వో వెంకటరమణ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు పట్టా భూములను వెబ్‌లాండ్ నమోదుతోపాటు కొండపై మైనింగ్ లీజు రద్దు చేయాలని దళితులు, గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ క్వారీ వల్ల గంటికోర్లాం, చినపాచిల పొలాలకు, చెరువులకు తీవ్ర నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని పట్టించుకోకుండా డీఆర్వో కారెక్కి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు, గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు కె. భవానీ పాల్గొన్నారు.



**వి.జె.పురంలో ఆర్డీవోకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజలు**

## కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

**నాతవరం:** విద్యా శాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మండలంలో పని చేస్తున్న సీఆర్పీలు, ఇతర కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీసం వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈనాడు
epaper.eenadu.net

# 'ఓటమిని జీర్ణించుకోలేకే ప్రేలాపనలు'

**అనకాపల్లి, న్యూస్‌టుడే:** మండలి ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకే వైకాపా నాయకులు మతిభ్రమించి అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని తెదేపా నాయకులు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో 83వ వార్డు ఇన్‌ఛార్జి బొడ్డపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి పోలారపు త్రినాథ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి అమర్‌నాథ్ ఎప్పుడు రాజీనామా చేస్తారో చెప్పాలన్నారు. అనకాపల్లి నియోజకవర్గాన్ని పార్టీలు, ప్రాంతాలకతీతంగా అభివృద్ధి చేసిన పీలా గోవింద సత్యనారాయణను విమర్శించే స్థాయి వైకాపా నాయకులకు లేదన్నారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్, పక్కన త్రినాథ్, గణేష్

### ఆర్యవైశ్యులపై కక్షతోనే దాడులు

వైకాపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్యవైశ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు ఆరోపించారు. వైకాపా నేతల అక్రమాలను ప్రశ్నించినందుకు అదే పార్టీకి చెందిన సుబ్బారావు గుప్తాపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. తెనాలి పురపాలక సంఘం కౌన్సిలర్ రాకేష్‌పై దాడులు చేశారన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 37 చోట్ల ఆర్యవైశ్యులపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సూరే సతీష్, గుండా సాయి పాల్గొన్నారు.

## 'పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడలేదు'

**పాయకరావుపేట:** గత నాలుగేళ్లలో ఏరోజూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడలేదని తెదేపా నుంచి సస్పెన్షన్‌కు గొర్రెల రాజబాబు, ఎం.నారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఎలాంటి ఆధారాలు లేకుండా తమను సస్పెండ్ చేశారన్నారు. గతంలో అనితకు సీటు రాకుండా పోరాటం చేసినందుకు ఇప్పుడు కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. పార్టీలో నెలకొన్న పరిస్థితులను అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తామని, ఆ తర్వాతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

**నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే:** న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, ఇందుకోసం ఓ చట్టం తీసుకురావాలని డిమాండు చేస్తూ విధులు బహిష్కరించి కోర్టు గేటు వద్ద నినాదాలు చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ తదితరులు సీనియర్ సివిల్ జడ్జి లీలావతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి లోవరాజు, కోశాధికారి గోవర్ధనగిరి తదితరులు పాల్గొన్నారు.



కోర్టు గేటు వద్ద నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH
( ANAKAPALLI ) PageNo :

సాక్షి

# మహిళా పోలీసులకు కళ్లద్దాల పంపిణీ

**సీతంపేట:** దృష్టి లోపాలతో ఇబ్బంది పడుతున్న 91 మంది మహిళా పోలీస్ సిబ్బందికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 8న స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 150 మంది మహిళా పోలీసు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి మంగళవారం ఉదయం డీసీపీ కార్యాలయంలో కళ్లద్దాలు అందజేశారు. ముఖ్యమంత్రి కంటి కేంద్రం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ సునీల్ గరుడ్, నేత్ర



**మహిళా పోలీసులకు కళ్లద్దాలు అందిస్తున్న డాక్టర్ విశ్వామిత్ర**

వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఆప్తమాలిక్ ఆఫీసర్లు ఎం.ఉమాశ్రీనివాస్, ఆర్. సురేష్ పాల్గొన్నారు.

Date: 05/04/2023, Edition: Visakhapatnam(Visakhapatnam North), Page: 9
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# చైన్ స్నాచర్ల హల్‌చల్

- మూడు చోట్ల దొంగతనాలు
- మహిళల మెడలో బంగారు ఆభరణాలు లాక్కొని పరారీ

**అల్లిపురం/ సీతమ్మధార/ మద్దిపాలెం:** నగరంలో మంగళవారం ఉదయం చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. నడిచి వెళ్తున్న మహిళలనే టార్గెట్ చేసి మూడు చోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు. ఉదయం 6.20 గంటల సమయంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులోని శ్రీనివాసనగర్ ప్రధాన ద్వారం రోడ్డులో రత్నావతి అనే 60 ఏళ్ల వృద్ధురాలు వాకింగ్ చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు హెల్మెట్, మాస్కులు ధరించి ఆటువైపుగా వచ్చారు. ఈ క్రమంలో ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలతాడుతో పాటు నల్లపూసలను లాక్కొన్నారు. నల్ల పూసలు రోడ్డు మీద పడిపోవడంతో పుస్తెలతాడు పట్టుకొని పారిపోయారు. సమాచారం అందుకున్న ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. అటుగా వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

**టూటౌన్ పరిధిలో..**

ఉదయం 6.30 గంటలకు రైల్వే క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన తాడి రమణమ్మ అనే 56 మహిళ సాత్‌జైలురోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద నుంచి దాబాగార్డెన్స్ అంబేద్కర్ సర్కిల్ వైపు నడిచి వస్తోంది. వెనుకనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని తులంన్నర బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు. దీంతో ఆమె గట్టిగా అరిచింది. స్థానికులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సమీపంలోని సీసీ పుటేజ్‌లను పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

**ఐదో పట్టణ స్టేషన్ పరిధిలో..**

జ్ఞానాపురంలో నివాసం ఉంటున్న ఓ మహిళ స్కూల్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగా స్కూల్‌కు వెళ్తున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆమె మెడలో మూడు తులాల బంగారు నగలను అపహరించారు. విషయం తెలుసుకున్న క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మహిళ ఫిర్యాదు మేరకు కంచరపాలెం క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఈ ఘటన సీసీ ఫుటేజీల్లో నమోదు కావడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. స్నాచర్లు వరస దొంగతనాలకు పాల్పడటంతో కంచరపాలెం మెట్టు వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీసీపీ ఆదేశాలతో కంచరపాలెం క్రైం సీఐ దుర్గా ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐలు, వెస్ట్ సబ్ డివిజన్ క్రైం పోలీసులు తనిఖీలు చేపట్టారు.

**త్రీటౌన్‌లో బైక్ చోరీపై ఫిర్యాదు**

ఆ ఇద్దరు యువకులు త్రీటౌన్ పరిధిలో ద్విచక్రవాహనం దొంగలించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేలింది. దీనిపై మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు నమోదైంది. ఆ ఇద్దరి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

Date: 05/04/2023, Edition: Visakhapatnam(Visakhapatnam District), Page: 8
Source : https://epaper.sakshi.com/

ఈనాడు
epaper.eenadu.net

# మరణశిక్షకు మేలైన మార్గమేది?

పూర్వం నేరస్థులకు మరణశిక్ష విధించేందుకు తల నరకడం, కాళ్లూ చేతులూ విపరీతంగా సాగదీసి హతమార్చడం, రాళ్లతో కొట్టి చంపడం, శూలంపై దిగేయడం, ఎత్తు నుంచి కిందకు తోసేయడం వంటి కిరాతక పద్ధతులను అనుసరించేవారు. ఆధునిక యుగంలో ఆ పద్ధతులకు స్వస్తి చెప్పారు. ఉరి, కరెంటు కుర్చీ, గ్యాస్ ఛాంబర్, విష ఇంజెక్షన్లు, తుపాకులతో కాల్చి చంపడం వంటి విధానాల్లో ఇప్పుడు మరణ దండనను అమలుచేస్తున్నారు. పాత పద్ధతులు అమానుషమైనవని, నేరస్థుడికి వేగంగా, తక్కువ బాధాకరమైన పద్ధతుల్లో మరణశిక్ష అమలుచేయాలన్న భావన బలపడింది. రిషి మల్హోత్రా అనే వ్యక్తి దాఖలుచేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ విచారిస్తూ- మానవీయ పద్ధతిలో మరణశిక్షను అమలుచేసే మార్గాలను అన్వేషించాలని మార్చి 21న కేంద్రానికి సూచించారు. మే నెల చివరికల్లా అభిప్రాయం చెప్పాలని కోరారు. భారత నేర శిక్షా స్మృతి-1973లోని సెక్షన్ 354(5)- ఉరి తీయడం ద్వారా మరణశిక్షను అమలు చేయాలని నిర్దేశిస్తోంది. అయితే ఈ విధానం మానవీయమైనదేనా, తక్కువ బాధాకరమేనా అన్నదానిపై చాలాకాలంగా చర్చ జరుగుతోంది.

## అమెరికాలో అయిదు పద్ధతులు

నేరస్థులకు మరణశిక్ష అమలుచేసేందుకు అమెరికాలో విషపూరిత ఇంజెక్షన్, గ్యాస్ ఛాంబర్, కరెంటు కుర్చీ, తుపాకులతో కాల్చి చంపడం, ఉరితీయడం వంటి అయిదు మార్గాలను అనుసరిస్తున్నారు. కుర్చీలో నేరస్థుడికి కరెంటు ఇచ్చి చంపడం రాజ్యాంగ విరుద్ధం, క్రూరం, అసాధారణమైన శిక్ష అని జార్జియా, నెబ్రాస్కా రాష్ట్రాల కోర్టులు తీర్మానించాయి. ప్రస్తుతం అమెరికాలో ప్రధానంగా విషపూరిత ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా మరణశిక్షను అమలుచేస్తున్నారు. జపాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, సింగపూర్, మలేసియాలు ఉరిశిక్షను పాటిస్తున్నాయి. చైనా, తైవాన్, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలు విషపూరిత ఇంజెక్షన్ పద్ధతిని చేపట్టాయి. ఫిలిప్పీన్స్ మాత్రం కరెంటు కుర్చీ పద్ధతిని అనుసరిస్తోంది. రష్యా, బెలారస్, ఇండొనేసియా వంటి దేశాలు ఫైరింగ్ స్క్వాడ్‌తో తుపాకీ కాల్పులు జరిపించి నేరస్థులకు మరణశిక్ష అమలుచేస్తున్నాయి. అమెరికాలో తొలిసారిగా న్యూయార్క్ స్టేట్ జైలులో 1890 ఆగస్టు 6న కరెంటు కుర్చీ పద్ధతిని అనుసరించారు. నేరస్థుడు విలియం కెమ్లర్ ఈ విధానం క్రూరమైనదంటూ సవాలు చేసినా సుప్రీంకోర్టు ఆయన విన్నపాన్ని తోసిపుచ్చింది. ఇచికావా వెర్సస్ జపాన్ కేసులో జపాన్ సుప్రీంకోర్టు ఉరిశిక్ష క్రూరమైనది కాదని తీర్పు చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ తండ్రి జస్టిస్ వైవి చంద్రచూడ్ సీజేఐగా ఉన్నప్పుడు... ఆయన నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కూడా ఉరి శిక్ష తక్కువ బాధాకరమైన మరణశిక్ష అని దీన్‌దయాళ్ వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తీర్మానించింది.

కరెంటు కుర్చీ ద్వారా మరణశిక్ష అమలుకు ఖరీదైన పరికరాలు కావాలి. అది ఎంతో బాధాకరమైనది కూడా. విషపూరిత ఇంజెక్షన్లు ఇవ్వడంపై 1949లో బ్రిటిష్ సర్కారు నియమించిన రాయల్ కమిషన్ అధ్యయనం చేపట్టింది. ఇంజెక్షన్‌ను నరం ద్వారా ఎక్కించాల్సి ఉంటుంది. అది ఎంతో నైపుణ్యం అవసరమైన సున్నిత ప్రక్రియ. తాను ఇంటర్వ్యూ చేసిన జైలు వైద్య అధికారులెవరూ విషపూరిత ఇంజెక్షన్ పద్ధతి ఉరి కన్నా మేలైనదని, మానవీయమైనదని భావించలేదని రాయల్ కమిషన్ నివేదిక వెల్లడించింది. విషపూరిత ఇంజెక్షన్ ప్రతిపాదనను ఆ కమిషన్ తిరస్కరించింది. భారత సుప్రీంకోర్టు- అన్ని మరణ శిక్షల్లోకీ ఉరి శిక్షే తక్కువ బాధాకరం, వేగవంతమని 1983లో తీర్మానించింది. మిగతా పద్ధతులు క్రూరమైనవని, అనాగరికమైనవని స్పష్టీకరించింది. ఉరిశిక్ష అమలుకు వేగంగా ఏర్పాట్లు చేయవచ్చు. దీన్ని అమలుచేసేటప్పుడు అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు సంభవించడం చాలా తక్కువ. తాడు బిగుసుకోగానే నేరస్థుడు అపస్మారక స్థితిలోకి జారుకొని, వేగంగా మరణిస్తాడు. ఆ సమయంలో నేరస్థుడికి కొంత బాధ కలిగినా, మిగతా విధానాలతో పోలిస్తే అది తక్కువగానే ఉంటుంది.





**దేశంలో 200 ఏళ్లుగా మరణశిక్ష పడిన నేరస్థులను ఉరితీస్తున్నారు. పూర్వకాలంలో నేరస్థులను అనేక రకాలుగా హింసించడం ద్వారా మరణశిక్షను అమలుచేసేవారు. ఇప్పుడు అమలులో ఉన్న ఉరి శిక్ష మానవీయమైనదేనా అన్నదానిపై ఎంతోకాలంగా చర్చ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే నేరస్థుడికి మరణశిక్ష అమలు చేసేందుకు అత్యంత తక్కువ బాధాకరమైన ప్రత్యామ్నాయ విధానాలను అన్వేషించాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్రానికి సూచించింది.**

## హుందాతనాన్ని కాపాడాలని...

ఉరి తీసిన తరవాత నేరస్థుడి మృతదేహాన్ని ఉరి కంబానికి అరగంట సేపు వేలాడుతూనే ఉంచాలని, ప్రాణం పోయినట్లు వైద్యాధికారి నిర్ధారించేవరకు దేహాన్ని కిందకు దించకూడదని జైలు నియమావళి నిర్దేశిస్తోంది. పౌరుల హుందాతనాన్ని కాపాడాలని, వారి పట్ల సమన్యాయంతో వ్యవహరించాలని 21వ రాజ్యాంగ అధికరణ పేర్కొంటోంది. ఇది సజీవులైన పౌరులకే కాదు, మృతులకూ వర్తిస్తుందని పరమానంద్ కటారా వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మరణాన్ని వైద్యాధికారి ధ్రువీకరించిన తరవాత ఉరికంబంనుంచి మృతదేహాన్ని కిందకు దించాల్సిందేనని పేర్కొంది. శాస్త్రీయ మార్పులను పరిగణనలోకి తీసుకుని మరణశిక్ష పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని బ్రిటిష్ రాయల్ కమిషన్ సిఫార్సు చేసింది. బహుశా ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే భారత సుప్రీంకోర్టు ఉరి శిక్ష కన్నా తక్కువ బాధాకరమైన పద్ధతుల్లో మరణశిక్ష అమలుచేసే విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. విషపూరిత ఇంజెక్షన్లు బాధను కలిగిస్తాయని గుర్తుచేసింది. మానవీయ పద్ధతుల్లో మరణ దండనను అమలు చేయాలన్న అవగాహన పెరగడం అభినందనీయమే అయినా- అసలు మరణ శిక్షనే పూర్తిగా రద్దు చేయాలన్న డిమాండునూ పరిశీలించాల్సిన సమయం వచ్చింది.

– హరీశ్ కుమార్ కొలివాల
(న్యాయ నిపుణులు)

## నిర్ధారించిన రాయల్ కమిషన్

మరణశిక్ష అమలుకు ఉత్తమ మార్గమేదో పరిశీలించడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1949లో రాయల్ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ విస్తృత అధ్యయనం తరవాత 1953 సెప్టెంబరులో సమర్పించిన నివేదిక ఉరి శిక్షే అతి తక్కువ బాధాకరమైనదని నిర్ధారించింది. కరెంటు కుర్చీలో మరణ శిక్షను అమలుచేసేటప్పుడు కాళ్లు కాలిపోతాయి. కనుగుడ్లు బయటికొస్తాయి. ఇతర రకాల మరణ శిక్షలూ అత్యంత బాధాకరంగా, క్రూరంగా ఉంటాయని రాయల్ కమిషన్ తేల్చింది. మరణ శిక్షపై భారత న్యాయ కమిషన్ 1967లో సమర్పించిన నివేదిక- ఉరి శిక్ష విస్తృతంగా అమలవుతున్నా, ఆ పద్ధతికి క్రమంగా స్వస్తిచెప్పాలంది. అయితే, ఆ కమిషన్ మాత్రం ఉరిశిక్షకు బదులు మరే ప్రత్యామ్నాయ విధానాన్నీ సూచించలేదు.

ఈనాడు
epaper.eenadu.net

# జంతు రవాణాను ఎందుకు నిలువరించడం లేదు?

- గెజిట్ ఇచ్చి వదిలేస్తే సరిపోతుందా?
- అధికారులపై హైకోర్టు ఆగ్రహం

**ఈనాడు, అమరావతి:** జంతు రవాణాను నిలువరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్‌ను ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. గెజిట్ జారీచేస్తే సరిపోతుందా? దానిని అమలు చేయడం మీ బాధ్యత కాదా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. గెజిట్‌కు భిన్నంగా పశువైద్యులు.. గోవులు, గేదెలు, ఎద్దుల రవాణాకు అనుమతి ఇస్తుంటే వారిపై పోలీసులు కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించింది. ఉల్లంఘనకు పాల్పడిన వారిని తీవ్రంగా పరిగణిస్తామంది. దిగువ స్థాయి సిబ్బందితో తక్షణమే సమావేశం నిర్వహించి.. గెజిట్ అమలుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. జంతు రవాణాకు పశువైద్యులెవరైనా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. రవాణా నివారణకు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని డీజీపీ, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. లంపీస్కిన్ వ్యాధి ప్రబలిన నేపథ్యంలో మూగజీవాల రవాణాను నిలువరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 31న గెజిట్ జారీచేసిందని, దానిని అధికారులు సక్రమంగా అమలు చేయడం లేదని పేర్కొంటూ విజయవాడకు చెందిన తోట సురేష్‌బాబు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఫణిదత్ చాణక్య వాదనలు వినిపించారు. ప్రస్తుతం గోవుల అక్రమ రవాణా జరుగుతోందన్నారు. పశు వైద్యులు రవాణాకు అనుమతిస్తూ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH ( VISAKHAPATNAM ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకునే క్రమంలో.. ఎస్సైకి తీవ్రగాయాలు



గాయపడిన ఎస్సై నాగరాజు

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకునే క్రమంలో తిరుపతి జిల్లా డక్కిలి ఎస్సై నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలం మీదుగా మంగళవారం ఎర్రచందనం స్మగ్లర్లు కారులో వస్తున్నట్లు రాపూరు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై క్రాంతికుమార్ కారును వెంబడించగా స్మగ్లర్లు పరారయ్యేందుకు తమ వాహనాన్ని రాపూరు నుంచి డక్కిలి మీదుగా మళ్లించారు. ఈ విషయాన్ని క్రాంతికుమార్ పొరుగు మండలమైన డక్కిలి ఎస్సై నాగరాజుకు చేరవేయగా, ఆయన వాహనంలో బయల్దేరారు. స్మగ్లర్లు ఎదురుగా వస్తున్న డక్కిలి పోలీస్ వాహనాన్ని గమనించి బ్రాహ్మణపల్లి వైపు కారును మళ్లించారు. ఊరు చివరి వరకూ వెళ్లాక.. ముందుకెళ్లే దారి కన్పించక వెనక్కి తిరిగారు. సంగనపల్లి సమీపంలో ఎస్సై నాగరాజు ఆ కారును అడ్డుకున్నారు. నలుగురు స్మగ్లర్లు పారిపోగా, ఇద్దరిని పట్టుకున్నారు. దొంగలకు, పోలీసులకు మధ్య తీవ్రస్థాయిలో పెనుగులాట జరుగుతున్న సమయంలోనే.. రాపూరు నుంచి బయల్దేరిన పోలీస్ జీపు ఘటనా స్థలానికి చేరుకుంది. అక్కడే జీపు అదుపు తప్పి డక్కిలి ఎస్సై నాగరాజును ఢీకొని, పైనుంచి వెళ్లింది. ఎస్సైకి భుజం, పక్కటెముకలు, తుంటి ఎముక వద్ద గాయాలయ్యాయి. ఆయనను కాపాడుకునే క్రమంలో పోలీసులు దొంగలను వదిలేయడంతో పరారయ్యారు. ఎస్సైని చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. వెంకటగిరి ఎస్సై జిలానీ ప్రమాద స్థలికి వెళ్లి కారు స్వాధీనం చేసుకుని డక్కిలి ఠాణాకు తరలించారు. కారులో స్మగ్లర్ల దుస్తులు మాత్రమే ఉన్నాయి.

Date : 05/04/2023 EditionName : ANDHRA PRADESH( VISAKHAPATNAM ) PageNo :

ABN
ఆంధ్రజ్యోతి

# ఐటీ చట్టం లేకుండా.. సైబర్ నేరాలపై కేసులా?

- తెలంగాణ, ఏపీల్లో ఐపీసీపైనే ఆధారం
- చార్జిషీట్లు, కన్విక్షన్లలో దారుణ గణాంకాలు
- ఢిల్లీలో సైబర్‌నేరాల్లో కన్విక్షన్ రేటు 100
- తెలంగాణలో 44.2.. ఏపీలో 14 మాత్రమే

(సెంట్రల్‌డెస్క్)

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ కేసు ఇప్పుడు రాష్ట్రాన్ని కుదిపేస్తుంది. నిందితులు కంప్యూటర్‌లో ఉన్న ప్రశ్నపత్రాన్ని హ్యాక్ చేశారని నిరూపితమైనా.. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) మొదట్లో భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. ఆ తర్వాత కొంత కాలానికి సమాచార సాంకేతి(ఐటీ) చట్టాన్ని ప్రయోగిస్తూ.. ఎఫ్‌ఐఆర్‌ను ఆల్టర్ చేసింది. ఇదొక్కటే కాదు.. తెలుగు రాష్ట్రాల్లో సైబర్ నేరాలకు సంబంధించిన సింహభాగం కేసులను ఐపీసీ కిందే నమోదు చేస్తున్నారు. ఫలితంగా.. చార్జిషీట్లు కోర్టుల్లో వీగిపోవడం.. నిందితులకు శిక్షలు పడకపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కామన్ కాజ్, సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీకి చెందిన లోక్‌నీతి ప్రోగ్రామ్ విడుదల చేసిన 'స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా రిపోర్ట్-2023' ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది.

## సైబర్ నేరాల్లో టాప్.. కన్విక్షన్‌లో పూర్

సైబర్ నేరాల్లో తెలంగాణ 10,303 (2021 గణాంకాల ప్రకారం) కేసులతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దేశంలో సైబర్ నేరాల రేటు 3.9 (52,972 కేసులు) ఉండగా.. తెలంగాణలో ఆ రేటు 27.3గా ఉంది. 10వేలకు పైగా సైబర్ నేరాలు నమోదైనా.. దర్యాప్తు అధికారులు ఐటీ చట్టాన్ని ప్రయోగించింది 6.55% కేసుల్లోనే.! అంటే.. 655 కేసుల్లో మాత్రమే ఈ చట్టాన్ని ప్రయోగించగా.. 9,644 కేసుల్లో ఐపీసీ సెక్షన్లను వాడారు. మరో నాలుగు కేసుల్లో ఇతర చట్టాల కింద ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. నిజానికి కంప్యూటర్ లేదా ఏదైనా ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఉపయోగించి చేసే నేరాలను సైబర్ నేరాలంటారు. ఆ కోణంలోనే తెలంగాణ పోలీసులు కేసులను నమోదు చేస్తున్నా.. ఐటీ చట్టాన్ని మాత్రం విస్మరిస్తున్నట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 8,829 సైబర్ నేరాలు నమోదవ్వగా.. 7,586 కేసుల్లో ఐటీ చట్టాన్ని ప్రయోగించారు. కేసుల్లో టాప్ అయినా.. చార్జిషీట్‌ల దాఖలులో తెలంగాణ పోలీసులు వెనుకంజలో ఉన్నట్లు ఈ నివేదిక చెబుతోంది. ఆయా కేసుల్లో 1,478(16.2 రేటు) చార్జిషీట్లను దాఖలు చేయగా.. కన్విక్షన్ల రేటు 44.2గా ఉంది. ఢిల్లీలో కన్విక్షన్ల రేటు 100, ఉత్తరప్రదేశ్‌లో 83.2, పశ్చిమబెంగాల్‌లో 70.8గా ఉండడం గమనార్హం. ఇక ఆంధ్రప్రదేశ్‌లో కూడా 1,875 సైబర్ నేరాలు నమోదవ్వగా.. కేవలం 171 కేసుల్లో ఐటీ చట్టాన్ని ప్రయోగించారు. 1,694 కేసుల్లో ఐపీసీ సెక్షన్లతోనే సరిపెట్టారు. ఏపీలో సైబర్ నేరాలకు సంబంధించి 363 చార్జిషీట్లు(31.8 రేటు) దాఖలు చేయగా.. కన్విక్షన్ల రేటు 14గా ఉంది. రాజకీయ దురుద్దేశాలతోనూ సైబర్ నేరాలు నమోదవుతున్నాయని.. 2021లో ఈ తరహా 112 కేసులతో అస్సాం టాప్‌లో ఉందని ఈ నివేదిక వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్(64), తమిళనాడు(44) ఉన్నాయి. తెలంగాణలో 17, ఏపీలో 36 సైబర్ కేసులను రాజకీయ దురుద్దేశాలతో నమోదు చేసినట్లు నివేదిక తెలిపింది.

## సీసీటీవీ కెమెరాల్లో టాప్.. అయినా..!

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సీసీటీవీ కెమెరాలను తెలంగాణ పోలీసులు వినియోగిస్తున్నారు. 2021 గణాంకాల ప్రకారం వీటి సంఖ్య 2,82,558. ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లోనూ వీటి సంఖ్య(10,218) చాలా తక్కువ. 2016-20 మధ్యకాలంలో తెలంగాణలో ప్రతి ఠాణా పరిధిలో సీసీటీవీ కెమెరాల సగటు 257గా ఉండగా.. వాటి ఆధారంగా పరిష్కరించిన కేసుల సగటు 354.5 మాత్రమే. ఇదే కాలంలో ఢిల్లీలో సీసీ కెమెరాల ద్వారా పరిష్కరించిన కేసుల సగటు 1,270.9 కావడం గమనార్హం.! ఇక ఏపీలో 14,770 సీసీకెమెరాలు పోలీసుల పరిధిలో ఉండగా.. ప్రతి పోలీస్‌స్టేషన్ సగటు 11.8 మాత్రమే. తెలంగాణలో 843 పోలీస్‌స్టేషన్లకు గాను.. 429 ఠాణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కర్ణాటక(1055 ఠాణాలకు గాను.. 1052 పీఎస్‌లలో సీసీకెమెరాల ఏర్పాటు)తో పోలిస్తే.. ఇది చాలా తక్కువ. ఏపీలో 1,027 ఠాణాలుండగా.. ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తుకు వివరాలు అందలేదని ఈ నివేదిక వెల్లడించింది. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ(ఎఫ్‌ఆర్‌టీ)లో 12 యూనిట్లతో మహారాష్ట్ర 11 యూనిట్లతో ఢిల్లీ మొదటి రెండు స్థానాలను ఆక్రమించగా.. తెలంగాణ, గుజరాత్‌లు చెరో 8 యూనిట్లతో మూడో స్థానంలో, ఏపీ, తమిళనాడు నాలుగో స్థానంలో ఉన్నాయి.

## సీసీకెమెరాలపై వ్యతిరేకత లేదు!!

కామన్ కాజ్, లోక్‌నీతి ప్రోగ్రామ్‌లు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై నిర్వహించిన సర్వేకు సంబంధించిన వివరాలను కూడా 'స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా-2023' నివేదికలో పొందుపరిచాయి. ఈ సర్వే ప్రకారం.. ప్రతి నలుగురిలో ముగ్గురు వ్యక్తులు పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడాన్ని బలంగా సమర్థిస్తున్నారు. ఈ చర్యను వ్యతిరేకిస్తున్న నాలుగోవంతు ప్రజల్లో ఎక్కువగా ముస్లింలు, ఆదివాసీలు ఉన్నట్లు ఈ సర్వే తేల్చింది. 9,779 మందితో నిర్వహించిన ఈ సర్వేలో పోలీసులు సీసీకెమెరాల ద్వారా నిఘాను కొనసాగించడాన్ని 52%, డ్రోన్ల ద్వారా పోలీసు నిఘాను 30%, ఎఫ్‌ఆర్‌టీని 25% మంది సమర్థించారు. ఆందోళనలు, ర్యాలీల సమయంలో డ్రోన్ కెమెరాల నిఘాను ప్రజలు ఎక్కువగా సమర్థించిన రాష్ట్రాల్లో గుజరాత్ మొదటిస్థానంలో.. పంజాబ్ చివరిస్థానంలో ఉన్నాయి.

## ప్రైవసీపై హైదరాబాద్ కేసు ప్రస్తావన

పోలీసులు వ్యక్తుల ఫొటోలు, వీడియోలను తీయడం వల్ల ప్రైవసీకి భంగం వాటిల్లుతోందంటూ నమోదైన కొన్ని కేసులను ఈ నివేదిక ప్రస్తావించింది. అందులో.. 2021లో హైదరాబాద్‌కు చెందిన ఎస్‌క్యూ మసూద్ అనే వ్యక్తి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను గురించి వివరించింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని తెలిపింది. కొవిడ్ సెకండ్‌వేవ్ కాలంలో మసూద్ తన ఇంటికి వెళ్తుండగా పోలీసులు నిలిపి, మాస్కును తీయించి, ఆయన ఫొటో తీసుకున్నారు. "ఈ ఫొటోలను ఏం చేస్తారు? ఎలా వాడుతారు?" అనే ప్రశ్నకు పోలీసులు సమాధానమివ్వకపోవడంతో.. ఈ చర్య తన అనుమతి లేకుండా ఇలా ఫొటోలు తీసుకోవడం వల్ల తన ప్రైవసీకి భంగం కలుగుతోందంటూ మసూద్ హైకోర్టును ఆశ్రయించారు. 2019లో తెలంగాణ పోలీసులు 'కాప్ కనెక్ట్' పేరిట సీసీకెమెరాలతో చేస్తున్న వీడియో అనలిటిక్స్(ఎఫ్‌ఆర్‌టీలో భాగం) కూడా ప్రైవసీకి భంగం వాటిల్లుతుందని ఈ నివేదిక వెల్లడించింది.

Date: 05/04/2023, Edition: Visakhapatnam, Page: 14
Source : https://epaper.andhrajyothy.com

# మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపాలి

- జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి
- సాగు, రవాణా నివారణకు పటిష్ట ప్రణాళికలు
- మత్తుపదార్థాల విక్రయ ప్రాంతాలపై నిఘా
- వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాలు
- 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయండి



అనకాపల్లి, ఏప్రిల్ 3( మనం న్యూస్): మాదక ద్రవ్యాలు సాగు చేయడం, రవాణా, అమ్మకాలపై నిఘా పెంచుతూ ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను తరువాయి 2లో..

# మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపాలి

ఆదేశించారు. మాదక ద్రవ్యాల నిరోదక శాఖ రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు పై సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గౌతమి శాలి తో కలిసి పోలీసు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు నెలవారీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. గంజాయి వంటి పంటలు సాగు చేయడం, రవాణా చేయడం నివారణపై పటిష్ట మైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాల ను అరికట్టేందుకు ప్రతిచోట్ల ముఖ్యంగా విద్యా సంస్థల గోడల పై టోల్ ఫ్రీ నెంబర్ ప్రదర్శించాలన్నారు. దీనికోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలన్నారు. మత్తు కల్గించే పదార్థాలను రవాణా చేసే వారి మీద విక్రయించే షాపులపై నిఘా పెట్టాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు మద్యం, పొగాకు, గంజాయి విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ, విద్యాసంస్థల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు 14500 టోల్ ఫ్రీ నంబర్లను ప్రదర్శించాలన్నారు. మరకద్రవ్యాలు నిరోధానికి మండల స్థాయి గ్రామస్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు..మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకం, రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 14500 టోల్ నెంబర్ కి కాల్ చేయాలన్నారు. ఈ నెంబర్ అందరికీ తెలిసేలా ప్రదర్శించేలా తగిన చర్యలు చేపట్టాలని విద్యా శాఖ అధికారులకు ఆదేశించారు. రైలు బస్సులలో మత్తు పదార్థాల రవాణా గుర్తించిన వెంటనే ఆర్టీసీ, రైల్వే సిబ్బంది పోలీసు కు సమాచారం ఇవ్వాలని రైల్వే ప్రజా రవాణా సంస్థల అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గూర్చి రిహాబిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో నిర్వహించే పౌర హక్కుల అవగాహన సదస్సుల్లో కూడా ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియ జేయాలన్నారు. పోలీసు సూపరెంటెండెంట్ గౌతమి శాలి మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల విక్రయాల నిఘాపై, రవాణా అరికట్టేందుకు చేపడుతున్న ప్రణాళికలు వివరించారు. మన జిల్లాలో గంజాయి పంటను సమూలంగా నాశనం చేశామని తెలిపారు. పోలీసులు, ప్రత్యేక బృందాలు, ఇంటెలిజెన్స్ వర్గాలు నిరంతరం నిఘాలో ఉన్నారని చెప్పారు. ముఖ్యంగా నర్సీపట్నం గొలిగొండ కేడీపేట మొదలైన చోట్ల ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయ్ భాస్కర్, అనకాపల్లి,నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అధికారులు చిన్ని కృష్ణ, జయరాం, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హేమంత్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, డీఎస్పీలు మళ్ల మహేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, కె.ప్రవీణ్ కుమార్, జిల్లా సిఐలు, రైల్వే ఆర్టీసీ పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ABN
ఆంధ్రజ్యోతి

## బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

**ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం, ఒకరికి గాయాలు**

కరప, ఏప్రిల్ 4: కాకినాడ జిల్లా పెదపూడి మండలం శివారున కృపాఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు చిక్కుకున్నారు. సామర్లకోటకు చెందిన పల్లపాటి శేషారావు(45)మృతి చెందాడు. డోకుబుర్ర రాజు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. యజమాని దూలపల్లి శ్రీను స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో పెద్దఎత్తున పేలుళ్లు సంభవించాయి. నార బాంబులు తయారుచేసే పనిలో ప్రమాదం జరిగిందా.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాణసంచా తయారుచేస్తుండగా మంటలు ఎగసిపడి ఆ మంటలు పక్కన ఉన్న బాణసంచా గొడౌన్లకు పాకాయి. దీంతో ఒక్కసారిగా పెద్దశబ్దాలతో పేలుళ్లు, మంటలు ఎగసిపడడంతో పరిసరాలలో ఉన్న వారికి కొద్దిసేపు ఏమీ తెలియలేదు. తేరుకుని దగ్గరకు వెళ్లిన స్థానికులకు అప్పటికే మంటల్లో చిక్కుకున్న డోకుబుర్ర రాజు, పల్లపాటి శేషారావు హాహాకారాలు చేస్తుండడంతో వారిని అంబులెన్స్‌లో ముందుగా పెదపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో శేషారావు మృతిచెందగా.. రాజు పరిస్థితి ఆందోళనాకరంగానే ఉన్నట్టు వైద్యులు స్పష్టం చేశారు. వీరిద్దరినీ రక్షించే ప్రయత్నంలో యజమాని శ్రీను కూడా స్వల్పగాయాలకు గురయ్యాడు.

Date: 05/04/2023, Edition: Visakhapatnam, Page: 14
Source : https://epaper.andhrajyothy.com



శుభోదయం